ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

శుక్రవారం 13 సెప్టెంబరు 2024

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి 8లో..

మాకూ 'డబుల్' ఇళ్లు కావాలి 8లో..

రుణమాఫీ సర్వేలో ముందంజ



- చురుకుగా కొనసాగుతున్న ప్రక్రియ
- మాఫీకాని రైతుల వద్దకు వెళ్లి వివరాల సేకరణ
- రైతు భరోసా యాప్‌లో నమోదు
- రైతు కుటుంబ సభ్యుల సెల్ఫీ ఫొటో అప్‌లోడ్
- జిల్లాలో నిర్ధారణ లక్ష్యం..12,620...ఇప్పటి వరకు పూర్తయినది 10,222

జగిత్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్ని అర్హతలున్నప్పటికీ రేషన్‌కార్డు లేని కారణంగా రుణమాఫీ కానీ రైతుల కుటుంబాల నిర్ధారణ (ఫ్యామిలీ గ్రూపింగ్) ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా చురుకుగా కొనసాగుతోంది. రాష్ట్రంలోనే రుణ మాఫీ సర్వేలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని వ్యవసాయ శాఖ వర్గాలు అంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో మండల వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లోకి వెళ్లి ఆయా రైతుల కుటుంబాలను నిర్ధారణ చేస్తున్నారు. ఇందుకోసం సదరు రైతు కుటుంబ సభ్యులంతా కలిసి ఓ సెల్ఫీ ఫొటో దిగాల్సి ఉంటోంది. ఈ ఫొటోను అధికారులు వ్యవసాయ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అలాగే కుటుంబసభ్యుల వివరాలతో కూడిన అఫిడవిట్‌ను కూడా రైతుల నుంచి తీసుకుంటున్నారు. ఈ అఫిడవిట్‌ను కూడా అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ ఫొటోలో కుటుంబ సభ్యులంతా ఉండాలి. లేని పక్షంలో కనీసం కుటుంబపెద్ద తప్పనిసరి చేశారు. రైతు కుటుంబ పెద్దలు చాలా మంది స్థానికంగా ఉంటలేరు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు తమ గ్రామానికి వచ్చి ఈ సెల్ఫీలు, అఫిడవిట్‌లు ఇవ్వాల్సి వస్తోంది. ఈ ప్రక్రియనుమండల వ్యవసాయ అధికారులు గ్రామాలకు వెళ్లి చేపడుతున్నారు.

జిల్లాలో లక్ష్యం 12,620...

జిల్లా వ్యాప్తంగా ఫ్యామిలీ గ్రూపింగ్ చేయాల్సిన లక్ష్యం 12,620 కాగా ఈనెల 11వ తేదీ వరకు 10,222 కుటుంబాల గ్రూపింగ్‌ను వ్యవసాయ అధికారులు పూర్తి చేశారు. మిగిలిన 2,398 ఫ్యామిలీ గ్రూపింగ్‌ను సాధ్యమైనంత తొందరలో పూర్తి చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోలిస్తే జిల్లా వ్యాప్తంగా ఫ్యామిలీ గ్రూపింగ్ లక్ష్యం ఎక్కువగా ఉన్నప్పటికీ వేగవంతంగా సర్వేను పూర్తి చేస్తూ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో జిల్లాను అగ్రభాగాన నిలిపామని వ్యవసాయ శాఖ వర్గాలు అంటున్నాయి.

పాతిక శాతం మందికి కాని రుణమాఫీ..

రాష్ట్ర పభుత్వం రైతుల పంట రుణాలను మాఫీని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విషయం విదితమే. ఒక్కో రైతు కుటుంబంలో రూ. 2 లక్షల మేరకు పంట రుణాలను మాఫీ చేస్తోంది. రూ. లక్ష లోపు పంట రుణ మున్న రైతులకు తొలి విడతలో, రూ. లక్ష నుంచి రూ. లక్షన్నర లోపు రుణమున్న రైతుల రుణాలను రెండో విడతలో, రూ. లక్షన్నర నుంచి రూ. రెండు లక్ష లోపు ఉన్న పంట రుణాలను మూడో విడతలో మాఫీ చేసింది. అనేక కారణాల వల్ల జిల్లాలో వేలాది మంది రైతుల పంట రుణాలు మాఫీ కాలేదు. మాఫీ వర్తించని సుమారు 35కు పైగా కారణాల్లో ఈ రేషన్‌కార్డు లేని కారణంగా వందలా మంది రైతులకు మాఫీ వర్తించ లేదు. ఇలా కుటుంబ నిర్ధారణ కాని రైతు కుటుంబాల నిర్ధారణ ప్రక్రియ ఇప్పుడు కొనసాగుతోంది. ఇలా కుటుంబ నిర్ధారణ జరగని రైతుల జాబితాను వ్యవసాయశాఖ బ్యాంకర్ల నుంచి సేకరించి మండల వ్యవసాయ అధికారులకు పంపింది. ఈ జాబితా ప్రకారం ఈ కుటుంబ నిర్ధారణ ప్రక్రియ కొనసాగుతోంది.

కుటుంబ పెద్ద విదేశాల్లో ఉంటే...

చాలా మంది రైతు కుటుంబాల్లోని కుటుంబపెద్దలు విదేశాల్లో ఉన్నారు. వారి కుటుంబ సభ్యులు ఇక్కడ తమ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇలా విదేశాల్లో ఉన్న రైతులకు సంబంధించిన వారి వివరాల జోలికి అధికారులు వెళ్లడం లేదు. ఈ జాబితాను ప్రస్తుతం పక్కన బెట్టారు. హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్ వంటి నగరాల్లో ఉంటున్న రైతు కుటుంబ పెద్దలు తమ స్వగ్రామాలకు వచ్చి సెల్ఫీ ఫొటోలు దిగి, అఫిడవిట్‌లు ఇస్తున్నారు. పక్షం రోజులుగా ఈ నిర్ధారణ కొనసాగుతోంది. నిర్ణీత షెడ్యూల్ మేరకు గ్రామాలకు వెళ్లి ఈ ప్రక్రియను చేస్తున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు ఈ పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నా యి. కానీ ఈ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో గడువు ప్రభుత్వం పొడిగించింది.

రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నాం: వాణి, జిల్లా వ్యవసాయ అధికారిణి

అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రుణమాఫీ కాని రైతులకు సంబంధించి ఫ్యామిలీ గ్రూపింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం. ఇప్పటికే సుమారు ముప్పాతిక శాతానికి మించి ఈ ప్రక్రియ పూర్తయింది. మిగిలిన దరఖాస్తులను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం. ప్రత్యేక యాప్‌లో ఈ వివరాలను నమోదు చేస్తున్నాం. ఫ్యామిలీ గ్రూపింగ్ ప్రక్రియలో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నాము.



ఫ్యామిలీ గ్రూపింగ్ కోసం సెల్ఫీ తీస్తున్న వ్యవసాయ అధికారులు(ఫైల్)

ప్రజాపాలన అంటే ప్రతిపక్ష నేతలపై దాడులేనా?

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



కమిటీని అభినందిస్తున్న దావ వసంత దంపతులు

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 12: ప్రజాపాలన అంటే ప్రతిపక్ష నేతలపై దాడి చేయడమేనా అని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మొన్న హరీష్ రావు, నేడు పాడి కౌశిక్‌రెడ్డిల ఇళ్లపై దాడులు చేయడం చూస్తే తెలంగాణలో ఎమ్మెల్యేలకే రక్షణలేని పరిస్థితి కనిపిస్తుందని, మరి సామాన్యుల సంగతేంటని ప్రశ్నించారు. భౌతికదాడులు, చర్యలకు పాల్పడడం ఆ పార్టీ అరాచకాలకు పరాకాష్ట అన్నారు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం పూర్తిగా బాధ్యతను మరిచి వ్యవహరించడం దారుణం అన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, భవిష్యత్‌లో ఆ పార్టీకి తగిన బుద్ది చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

● జగిత్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా పూటూరి నవీన్, ప్రధాన కార్యదర్శిగా బొడ్ల జగదీష్, కోశాధికారిగా పెద్ది శ్రీనివాస్ తన జడ్పీ క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలువగా, నూతన కమిటీ సభ్యులను దావ వసంత సురేష్‌లు శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. సంఘ అభివృద్దితో పాటు, సమాజ అభివృద్దికి పాటు పడాలని సూచించారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

వేలంలో లడ్డూ దక్కించుకున్న సత్తార్ అన్వర్



లడ్డూను వేలంలో దక్కించుకున్న అన్వర్

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 12: జగిత్యాల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుని వద్ద స్వామి వారి లడ్డూ ప్రసాదం వేలం పాటలో మతసామరస్యం వెల్లివిరిసింది. ఈ గణేశుని నిమజ్జనం కార్యక్రమానికి ముందు లడ్డూ వేలం పాటతో రూ.11,111లకు ప్రముఖ సిటీ ఛానల్ అధినేత అబ్దుల్ సత్తార్ అన్వర్ దక్కించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లడ్డూ వేలంలో పాల్గొనడమే కాకుండా, లడ్డూను దక్కించుకొని మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన అన్వర్‌ను సహచర పాత్రికేయులతో పాటు, పలువురు అభినందనలు తెలిపారు.

ఏచూరి మరణం ఉద్యమాలకు తీరని లోటు

జగిత్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ప్రధాన కార్యదర్శి, మార్క్సిస్టు యోధుడు సీతారం ఏచూరి మరణం అభ్యుదయ ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుక్కోవెల శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్ అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. విద్యారంగానికి, ఉపాధ్యాయ ఉద్యమానికి సీతారం ఏచూరి వీడని సంబంధం కలిగియున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యూటీఎఫ్, జాతీయ స్థాయిలో ఎస్ఎఫ్ఐ నిర్వహించిన విద్యా సదస్సులు, మహా సభల్లో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఏచూరి పాల్గొని స్ఫూర్తిదాయక ఉపన్యాసాలతో ఉపాధ్యాయులను ఉత్తేజపరిచారని గుర్తు చేశారు. సీతారం ఏచూరి మరణం పట్ల టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ పక్షాన ఘనంగా నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు.

'రైతు ఆత్మహత్యాయత్నం బాధాకరం'

కథలాపూర్, సెప్టెంబరు 12 : మండలంలోని భూషణరావుపేటకు చెందిన ఏనుగు సాగర్‌రెడ్డి అనే రైతుకు ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం బాధాకరమని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పేర్కొన్నారు. గురువారం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాగర్‌రెడ్డిని పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల ప్రాణాలు పోయే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. సాగర్‌రెడ్డి కుటుంబానికి రు. 25 లక్షల నష్టపరిహారం అందించ డంతో పాటు మెరుగైన వైద్యం ప్రభుత్వం చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ కొండ ఆంజనేయులు ఉన్నారు.

రాజకీయం చేయడం తగదు

కథలాపూర్, సెప్టెంబరు 12 : కొన్నేళ్లుగా పట్టాదారు పాసుపుస్తకం ఇప్పించాలని రైతు అధికారుల వద్దకు తిరిగి విసిగిపోయి ఆత్మహత్యా యత్నానికి పాల్పడితే బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేయడం విడ్డూరమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం ఆరోపించారు. గురువారం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భూషణరావుపేటకు చెందిన ఏనుగు సాగర్‌రెడ్డిని పరామర్శించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

రాయికల్, సెప్టెంబరు 12: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని శివనాయక్ తండా, అలియానాయక్ తండా, లాలియా నాయక్ తండా, రాజనగర్ తండా, గాంధీ తండాల్లో నాటుసారా స్థావరాలపై గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా 5 కేసులు నమోదు చేశారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. దాడుల్లో 8 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామని తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు టి. డేవిడ్ రవికాంత్, కె.వరప్రసాద్, ఎ.సత్యనారాయణ, సీహెచ్ రాజమౌళి, వినోద్ రాథోడ్, మహేందర్ సింగ్, లక్ష్మణ్ కుమార్, మాజీద్, మేఘమాల, ఎస్సై అనిల్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం ఇన్‌ఫ్లో కొనసాగింది. ఎస్సారెస్పీలోకి 41,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 34,705 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



మందులు పంపిణీ చేస్తున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, సెప్టెంబరు 12: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని బ్రాహ్మణ సేవా సంఘ భవనంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో తగిన విధంగా మందులు, రక్త పరీక్ష చేసే కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎక్కడైన స్టాక్ తగ్గితే ప్రభుత్వంతో మాట్లాడి సరిపడే విధంగా స్టాకును తెప్పిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ దోమలు అభివృద్ధి చెందకుండా చూసుకుంటే సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సమీయొద్దీన్ మాట్లాడుతూ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా తదితర పరీక్షలు ఉచితంగా చేసి మందులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో రవీందర్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ బాలె గంగాధర్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కు రవీందర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్ పాల్గొన్నారు.

వారంలోగా గురుకులం పనులు పూర్తి చేయాలి

మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్



పెద్దాపూర్ గురుకుల పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 12 : వారం రోజుల్లోగా పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో చేపట్టిన పనులను పూర్తి చేయాలని ఆర్డీవో శ్రీనివాస్ ఆదేశించారు. పాఠశాలలో పరిసరాలు, గదులు, నూతన భవనంలో చేపట్టిన పనులు, వసతులను ఆర్డీవో గురువారం పరిశీలించారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాఠశాలను సందర్శించి గురుకులంలో మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆర్డీవో ప్రిన్సిపాల్ మాధవీలతతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలోని వసతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల్లో ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి శానిటేషన్ పనులు చేపట్టాలని, నూతన భవనంలో మిగిలిన ఫ్లబింగ్ పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. పాఠశాలకు పూర్తి స్థాయిలో విద్యార్థులు వచ్చేలా తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, గురుకులంలో ఇంకా సమస్యలు ఉంటే తెలపాలన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, శానిటేషన్ పనులు జరిగేలా చూసుకోవాలని నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈయన వెంట గురుకుల ప్రిన్సిపాల్ మాధవీలత, ఉపాధ్యాయులు షైపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, సిబ్బంది, ఉన్నారు.

రాహుల్ వ్యాఖ్యలు దురదృష్టకరం

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 12: దేశంలో మత కల్లోలాలు, విద్వేషాలు రెచ్చగొట్టేలా రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను నిరసిస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమానికి హాజరైన గంగారెడ్డితో పాటు జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణిలు మాట్లాడుతూ దేశంలోనే ప్రతిపక్ష హోదాలో ఉన్న నాయకుడు రాహుల్‌గాంధీ అని, అలాంటి వ్యక్తి విదేశాలలో దేశ ఔన్నత్యాన్ని కించపర్చేలా మాట్లడడం, హిందూ జాతిని, సిక్కులను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ని, భరతమాతని అవ మానించేలా చేసిన వ్యాఖ్యలు విచారకరం అన్నారు. మత విద్వే షాలు రెచ్చగొట్టేలా యత్నిస్తున్న కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జగిత్యాల జిల్లా శాఖ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, మండలాధ్యక్షుడు తిరుపతి, రాంరెడ్డి, ధర్మపురి, నర్సయ్య, రాజు, దివాకర్‌తో పాటు జిల్లా పదాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్-(10

రాయికల్, సెప్టెంబరు 12: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని జగిత్యాల అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి అన్నారు. మండలంలోని ఒడ్డెలింగాపూర్, వస్తాపూర్, కట్కాపూర్, మైతాపూర్, అయోధ్య, రాజనగర్ గ్రామ పంచాయతీలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రోజు ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ చేయాలని, సీజనల్ వ్యాధులు రాకుండా దోమల మందు పిచికారి, డ్రై డే, క్లోరినేషన్ తదితర చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. 100 శాతం పన్నుల వసూళ్ల కోసం సూచనలు చేశారు. ఈ విషయంలో ఎంపీడీవో, ఎంపీవోలు ప్రతి రోజు గ్రామ సందర్శన చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మా, ఏఈ పీఆర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వరద కాలువను పరిశీలించిన అధికారులు

భీమారం, సెప్టెంబరు 12: భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామంలో గుర్రాల బాట రోడ్డు పునరుద్ధరణ కోసం గ్రామస్థులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వరద కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించగా నీటి పారుదల శాఖ అధికారులు గురువారం గ్రామానికి వెళ్లి సర్వే చేపట్టారు. ఈ పరిశీలనలో పాత రోడ్డు ఉందనే ప్రాథమిక అంచనాకు వచ్చామని, మ రింత స్పష్టత కోసం నక్ష ప్రతి అవసరమని, దాని పరిశీలన తర్వాత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని అధికారులు పేర్కొన్నారు. తక్షణమే సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేసిన ఎమ్మెల్యేకు, భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డిలకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గంట గంగరాజం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్సింగా రావు, వడ్ల గంగాధర్, మహిపాల్ రెడ్డి, యువజన సంఘం నాయకులు ఎనుగంటి హరీష్, ఉమ్మడి రవి పాల్గొన్నారు.

మగ్గిడి గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

ధర్మపురి, సెప్టెంబరు 12: ధర్మపురి మండలంలోని మగ్గిడి గ్రామంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం, విద్యా బోధన గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అలాగే తరగతి గదులను, వంటశాలను, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పరిశీలించారు. నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఆయన ఆదేశించారు. ఇందులో భాగంగా కాంపౌండ్ వాల్ మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, టాయిలెట్లను శానిటేషన్ చేయించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగు నీరు అందించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్, మండల తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో నరేష్‌కుమార్, ప్రిన్సిపాల్ రమేష్ పాల్గొన్నారు.



మగ్గిడి గురుకుల పాఠశాల వంట గదులను పరిశీలిస్తున్న కలెక్టర్

లారీ ఢీకొని రైతు మృతి

- మరొకరికి గాయాలు


చిన్నలింబన్న(ఫైల్)

మల్లాపూర్, సెప్టెంబరు 12: మండలంలోని మొగిలిపేట గ్రామ శివారు లో లారీ ఢీకొట్టడంతో రాణవేని చిన్నలింబన(60) అను రైతు గురువారం మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓబులాపూర్ గ్రామానికి చెందని రాణవేని చిన్నలింబ న్నతో పాటు గ్రామానికి చెందిన మల్యాల గంగులు మొగిలిపేట గ్రామ శివారులోని ఉన్న మొక్క జొన్న తోటకు వెళ్లారు. చేనులో పనులు ముగించుకుని చిన్నలింబన్న ద్విచక్ర వాహనంపై ఇద్దరు ఓబులాపూర్‌కు బయల్దేరారు. ఖానాపూర్ నుంచి మెట్‌పల్లికి వెళ్తున్న లారీని డ్రైవర్ సయ్యద్ ముస్తాక్ అజాగ్రత్తగా మొగిలిపేట శివారులో చిన్నలింబన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో చిన్నలింబన్న తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. గాయాల పాలైన గంగును చికిత్స కోసం మెట్‌పల్లికి తరలించారు. మృతుడి భార్య రాజగంగు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

వీణవంక, సెప్టెంబరు 12: మండలంలోని రామక్క షాపూర్ గ్రామానికి చెందిన బొబ్బల మోహన్‌రెడ్డి (82) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరా ల ప్రకారం.. మోహన్‌రెడ్డి భార్య ప్రమీల తొమ్మిది నెలల క్రితం మృతి చెందగా అప్పటి నుంచి ఒంటరి తనం భరించలేక జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహ త్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు బొబ్బల అశోక్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

రూ.7,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట, సెప్టెంబరు 12: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,800 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు తొమ్మిది మంది రైతులు 117క్వింటాళ్లు విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,800 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఖరారయ్యేనా..?

- నేడు మూడో సారి తలనీలాల టెండర్లు
- దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాట్లు

మల్యాల, సెప్టెంబరు 12: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధి లో తలానీలా పోగు చేసుకునేందుకు గాను అధికారులు మరో సారి తలానీ లాల టెండర్లు శుక్రవారం నిర్వహించనున్నారు. ఇందుకు గాను హైదరాబా ద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో ఈ-టెండర్, సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం జరుగనుంది. ఇప్పటికే రెండు సార్లు టెండర్లు నిర్వహిం చగా తగిన వేలం రాకపోవడంతో వేలం వాయిదా వేసిన అధికారులు మూడో సారి శుక్రవారం నిర్వహించను న్నారు. ఈ ఆగస్టు నుంచి వచ్చే ఏడాది జూలై నెలాఖరు కాలపరిమితికి గాను మొదటి సారి టెండర్ ఫిబ్రవరి 7న నిర్వహించిన వేలంలో రూ.కోటి 62లక్షల 1,116 హెచ్చు పాట రాగ ఈ సారి అక్కడి నుంచే వేలం ప్రారంభించనున్నారు.

కాగా కొండగట్టులో నిర్వహించిన తలానీలాల టెండర్లు ప్రతీ సారీ కొలిక్కి రాకపోవడంతో అధికారులు కమిషనర్ కార్యాలయంలో నిర్వహి స్తున్నారు. కాగా మూడో సారి అయిన ఖరారు అయ్యేనా అని ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. శుక్రవారం నిర్వహించే టెండరులో పాల్గొనడానికి 10 షెడ్యూల్స్ వచ్చినట్లు తెలిసింది

నరసింహుడి సన్నిధిలో సినీ నటుడు రాజీవ్ కనకాల


రాజీవ్ కనకాలకు స్వామి చిత్రపటం బహూకరిస్తున్న ఆలయ ఈవో

ధర్మపురి, ఆగస్టు 12: ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని సి నీ నటుడు రాజీవ్ కనకాల గురువారం ఉదయం సందర్శించారు. వేద పం డితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆ యన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపం డితుల మంత్రోచ్చారణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, చిత్రపటం బహూకరించి సత్కరిం చారు. అనుబంధ ఆలయాలను కూడ సందర్శించారు. ఆయన వెంట ఆల య సూపరింటెండెండ్ ద్యావళ్ల కిరణ్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీని వాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, నంబి నరసింహమూర్తి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● అంజన్నను దర్శించుకున్న అంబర్‌పేట ఎమ్మెల్యే

మల్యాల, సెప్టెంబరు 12: కొండగట్టు ఆంజనేయస్వామిని గురువారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పర్య వేక్షకులు హరిహర నాథ్ శేషవస్త్రాలతో సత్కరించారు. అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ తదితరులు ఉన్నారు.

● సినీనటుడి పూజలు

సినీ నటుడు రాజీవ్ కనకాల ఆంజనేయ స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. స్వామి వారి విశిష్టతను ఆలయ అర్చకులు వివరించారు. పర్యవేక్షకులు హరిహరనాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ ఆయన వెంట ఉన్నారు. రాజీవ్ కనకాలతో పలువురు సెల్ఫీలు దిగారు.

ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల నిరసన

గణేశ్‌నగర్, సెప్టెంబరు12: రాష్ట్ర విద్యుత్తు ఎస్సీ మరియు ఎస్టీ ఉద్యోగుల ఐకాస పిలుపు మేరకు జిల్లా విద్యుత్ భవన్ కార్యాలయం ఎదుట గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టీజీఎన్పీడీసీఎల్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆనందం, డివిజనల్ ఇంజనీర్ వరంగల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే ఆనంద్, బండారి చంద్రయ్య మరియు ప్రాంతీయ కార్యదర్శి శ్రీ వీ కిరణ్ కుమార్ కరీంనగర్, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం శ్రీ సుల్తాన్ రవి, ఏఏవో రాందాస్, గణేష్ జేఏవో కరీంనగర్ టౌన్ మరియు రూరల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆరేపల్లి శామయ్య, మల్లేపల్లి అంజయ్య , జాడి తిరుపతి, రత్నం పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్

భగత్‌నగర్, సెప్టెంబరు 12: కొత్తపల్లి మండలంలోని చింతకుంట, కొత్తపల్లి పట్టణంలో నిర్వహించే నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్‌లు అన్నారు. గురువారం చింతకుంటలోని ఎస్సారెస్పీ కాలువ, కొత్తపల్లి చెరువులను పరిశీ లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమజ్జనానికి ఆటంకం లేకుండా చెరువులో తుంగను తీయించాలన్నారు. చుట్టు పక్కల ప్రజలకు ఇబ్బందులకు లేకుండా బారికేడ్లను ఏర్పాటు చేయడానికి భూమిని చదువును చేయాలన్నారు. చెరువు పరిసరాల్లో డస్ట్ చల్లించడం, లైటింగ్ ఏర్పాట్లు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ రాజేశ్, మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మున్సిపల్ కమిషనర్ రమేష్, ట్రాన్స్‌కో ఎస్ఈ గంగాధర్, ఇరిగేషన్ ఈఈ నాగభూషణం, ఆర్అండ్‌బీ, కార్పొరేషన్, రెవెన్యూ, శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో విలేకరినంటూ బెదిరింపులు

» బాధితుడి ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: తాను పత్రికా విలేకరినంటూ డబ్బుల కోసం బిల్డర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ నగర శివారులోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సీబీఆర్ కాలనీలో బిల్డర్ జన్వాడ రవి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే, రామచంద్రాపురం సాయి నగర్‌కు చెందిన దగుడు రాము(42).. తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆర్డీవో, తహసీల్దార్ తెలుసునని, పాతబస్తీకి చెందిన పహిల్వాన్లతో తనకు పరిచయాలున్నాయని, నిర్మిస్తున్న భవనంపై కథనాలు రాసి కూల్చివేయిస్తానని బిల్డర్‌ను బెదిరించాడు. తనకు రూ.5 లక్షల ఇవ్వాలని లేదంటే తన పత్రికలో భవనం ఫొటో వేసి వార్తలు ప్రచురిస్తానని హెచ్చరించాడు. దీంతో బిల్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడు రామును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో కొందరు పత్రికలు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధుల పేరుతో డబ్బుల కోసం కొందరు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.

ఇక్కడ ఉండొద్దు ఖాళీ చెయ్యండి

» సున్నం చెరువు నిర్వాసితులకు హైడ్రా ఆదేశం

» ప్రత్యామ్నాయం చూపాలని బాధితుల వేడుకోలు

రాయదుర్గం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, మాదాపూర్ సున్నం చెరువులో ఆక్రమణలను నాలుగు రోజుల క్రితం కూల్చేసిన హైడ్రా అధికారులు ఆ ప్రాంతాన్ని గురువారం మరోసారి పరిశీలించారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారిని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని, గుడిసెలను కూడా తొలగించాలని ఆదేశించారు. ఆ స్థలంలో నివాసముండకూడదని స్పష్టం చేశారు. అయితే, చిన్నపిల్లలతో ఉన్న తాము ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయం చూపాలని వేడుకున్నారు.

సున్నం చెరువు పరిధిపై రీసర్వే చెయ్యండి

ఎస్ఐఈటీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వినతి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన పైసా పైసా కూడబెట్టి భూమిని కొనుగోలు చేసి అన్ని అనుమతులతో తాము నిర్మించుకున్న ఇళ్లను ఎఫ్‌టీఎల్ పేరుతో కూల్చివేయడం అన్యాయమని ఎస్ఐఈటీ(స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్ టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ల యజమానులు వాపోయారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ సొసైటీ అధ్యక్షుడు టీఎస్ఎస్‌న్ రాజు, ఇతర సభ్యులు మాట్లాడారు. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్ 12, 12ఏ,13లోని 24 ఎకరాల ప్రైవేట్ భూమిని 1990లో కొనుగోలు చేయగా, 1992లో హెచ్ఎండీఏ అనుమతులతో సొసైటీ సభ్యులకు కేటాయించామని తెలిపారు. ఆయా స్థలాలకు యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లించామని చెప్పారు. అన్ని అనుమతులు పొందడంతో కొందరు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వివరించారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించాలని, ఒక వేళ భూమి అంతా ప్రభుత్వం తీసుకుంటే తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

మూడ్రోజులుగా నిలిచిన 'మీ-సేవ'!

» సర్వర్‌లో సాంకేతిక సమస్య.. రెండ్రోజులు పట్టే అవకాశం

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవా కేంద్రాల్లో గత మూడ్రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్లలో మార్పులు చేర్పులు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి ఎదురైంది. మూడ్రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలు నిలిచాయని, మరో రెండ్రోజుల్లో పునరుద్ధరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

బిల్లులు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 12: పాఠశాలలో చేసిన భవన నిర్మాణ పనులకు బిల్లులు రాలేదని ఓ కాంట్రాక్టర్ బడికి తాళం వేశాడు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ నిఖిల్ భవన నిర్మాణ పనులను ఏడాదిన్నర క్రితం చేపట్టారు. అప్పటి నుంచి బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురై గురువారం బెంచీలు బయటవేసి, తరగతి గదులకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు బయట ఉన్న చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చింది. కాంట్రాక్టర్ తీరుపైన ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్థులు కాంట్రాక్టర్‌కు సర్ది చెప్పడంతో తాళాలు తీశాడు.

ఇన్‌స్టా రీల్‌తో చిన్నారులకు పెద్ద సాయం

తల్లిని కోల్పోయిన పిల్లలకు రూ.21లక్షలు ఇచ్చిన దాతలు

నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 12 : సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుంటే అద్భుతాలు జరుగుతాయి, ఎన్నో సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయి అనేందుకు ఉదాహరణగా నిలిచే ఘటన మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. తల్లిని కోల్పోయిన అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులకు మానవత్వం కలిగిన ఎన్నో హృదయాలు అండగా నిలిచాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను చూసి స్పందించిన దాతలంతా కలిసి ఆ చిన్నారులకు ఏకంగా రూ.21 లక్షలు ఆర్థిక సాయం చేసి ఔరా అనిపించారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటకు చెందిన బేతమల్ల నరేష్, ఉమ దంపతులకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ తాపి మేస్త్రీగా పని చేస్తుంటాడు. ఈ దంపతులకు ఓ కుమార్తె(3), ఓ కుమారుడు(నెలన్నర) ఉన్నారు. అయితే, కొడుకును ప్రసవించిన ఎనిమిది రోజులకు, జూలై 28న ఉమ బ్రెయిన్ స్ట్రోక్ గురై మరణించింది. నిరుపేద అయిన తండ్రి, లోకం తెలియని ఆ పిల్లల పరిస్థితిని తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా కురివికి చెందిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ గంగరబోయిన రఘు చలించిపోయారు. నరేష్ ఇంటికి వెళ్లి వారి పరిస్థితిని వివరించేలా ఓ వీడియో చేసి ఆ పిల్లలకు సాయం చేయాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. రఘు పిలుపునకు స్పందించి ముందుకొచ్చిన దాతలు ఆర్థిక సాయం పంపారు. దాతల పంపిన మొత్తం రూ.21 లక్షలు అవ్వగా.. ఆ సొమ్మును చిన్నారుల పేరిట మహబూబాబాద్ ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను నరేష్‌కు గురువారం అందజేశారు. ఆ చిన్నారులకు ఇంత సాయం అందడానికి కారణమైన గంగరబోయిన రఘును పలువురు అభినందించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు.. లైసెన్స్ రద్దు!


» ప్రమాదాల పెరుగుదల నేపథ్యంలో కఠిన చర్యలకు రవాణా శాఖ కసరత్తు..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ నిర్ణయించింది. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇక నుంచి రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం, రేసింగ్‌లు తదితర ఉల్లంఘనల విషయంలో కూడా సీరియస్‌గా వ్యవహరించనున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు మాత్రమే ప్రస్తుతం కోర్టు ఆదేశాలు, పోలీసుల సిఫారసు మేరకు 3 నుంచి 6 నెలల పాటు లైసెన్స్‌లను సస్పెన్షన్‌లో పెడుతున్నారు. మిగతా ఉల్లంఘనలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న చిన్న ఉల్లంఘనలకు సంబంధించి కూడా ఇకపై లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టనున్నట్టు రవాణా శాఖ వర్గాలు తెలిపాయి. మెజార్టీ రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం కారణమని గుర్తించిన నేపథ్యంలో నిబంధనల కచ్చిత అమలుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కాగా, గత రెండున్నరేళ్లలో వివిధ ఉల్లంఘనలకు సంబంధించి 26 వేలకుపైగా డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 2022-23లో అత్యధికంగా 16 వేలకు పైగా లైసెన్స్‌లు సస్పెండ్ చేశారు. 2023-24లో 7 వేలకు పైగా.. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 2,200 లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యాచరణ

» ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేష్‌కుమార్ గౌడ్ భేటీ

» ఉప ఎన్నికలు రాకపోవచ్చన్న టీపీసీసీ కొత్త అధ్యక్షుడు



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్, కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా తన కార్యాచరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన తన కుటుంబసభ్యులతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజాజీమార్గ్‌లోని నివాసంలో కలుసుకున్నారు. అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఖర్గే ఆశీర్వాదం కోసం వచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మారిన ప్రతిసారి కొత్త కమిటీలు ఏర్పడతాయని, కొత్త కమిటీల విషయంలో ఏఐసీసీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయించిన అంశంలో హైకోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తూనే.. న్యాయప్రత్యామ్నాయాలు చూస్తామని తెలిపారు. తమ పార్టీ విధానాలు, పాలన చూసి కొందరు నేతలు వస్తే చేర్చుకున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతిపక్ష పాత్ర నిర్వహించే స్థితిలో బీఆర్ఎస్ నేతలు లేరని, లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు వారికి సున్నా స్థానాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో ఉప ఎన్నికలు వస్తాయని తాను భావించడంలే దని, ఒక వేళ వచ్చినా ఆ స్థానాలు తమ ఖాతాలోనే పడతాయని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యుడని, నిబంధనల మేరకే పీఏసీ ఛైర్మన్ అయ్యారని అన్నారు. మరోవైపు ఎయిమ్స్ ఆస్పత్రిలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయానికి మహేష్‌కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు.

విద్యుత్తు కొనుగోళ్లపై నిషేధం!

పవర్‌గ్రిడ్‌కు రూ.261 కోట్లు చెల్లించలేదని టీజీఎస్పీడీసీఎల్‌పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా చర్యలు

» ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలులో గత ప్రభుత్వ నిర్వాకంతోనే..

» హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీడీసీఎల్

» పవర్‌గ్రిడ్ ఉత్తర్వులపై స్టే విధించిన కోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)కు గత ప్రభుత్వ నిర్వాకంతో షాక్ తగిలింది. ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం డిస్కమ్‌కు శాపంలా మారింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తును తీసుకుంటామని కారిడార్ బుక్ చేసుకున్న తర్వాత, అవసరం లేదని పేర్కొన్న కేసులో రూ.261.31 కోట్లను ఎస్పీడీసీఎల్ చెల్లించడం లేదంటూ పవర్ గ్రిడ్ జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎన్ఎల్‌డీసీ బహిరంగ విపణిలో ఎస్పీడీసీఎల్ విద్యుత్తు క్రయవిక్రయాలపై గురువారం ఉదయం నిషేధం విధించింది. గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్లు, అదనంగా మరో 1000 మెగావాట్ల కోసం పవర్‌గ్రిడ్‌తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. విద్యుత్తు చెల్లింపుల వివాదంతో మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్ల కరెంట్ ఆగిపోగా.. అదనంగా తీసుకుంటామని చెప్పిన 1000మెగావాట్లపై బీఆర్ఎస్ సర్కారు వెనక్కి తగ్గింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో లైన్లు వేసినప్పటికీ వినియోగించుకోకుండా వదిలేసినందున చార్జీల కింద రూ.261.31కోట్లు చెల్లించాలంటూ మార్చి 12న పవర్ గ్రిడ్ తెలంగాణ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీకి బిల్లును పంపింది. దీనిపై కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్సీ)లో టీజీఎస్పీడీసీఎల్ పిటిషన్ వేసింది. ఈ కేసులో వాదనలు జరగాల్సి ఉండగా.. 'గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా'కు పవర్ గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్లకు అవకాశం లేకుండా కట్టడి చేస్తూ బుధవారం ప్రాప్తి (పేమెంట్ రాటిఫికేషన్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్‌వాయిసింగ్ ఆఫ్ జనరేటర్స్) పోర్టల్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ఆధారంగా గురువారం ఉదయం నుంచి కరెంట్ కొనుగోళ్లు నిలుపుదల చేసింది. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేయాలని ఆదేశించారు. సీఎం సూచనలతో అధికారులు కోర్టును ఆశ్రయించారు.

స్టే విధించిన హైకోర్టు

చార్జీల కేసు సీఈఆర్సీలో పెండింగ్‌లో ఉండగా కఠిన చర్యలు చేపట్టడం అక్రమమని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని పేర్కొంటూ టీజీఎస్పీడీసీఎల్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. డిస్కం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కమిషన్ వద్ద కేసు పెండింగ్‌లో ఉండగానే ప్రతివాదులు లేట్ పేమెంట్ సర్‌చార్జి నిబంధనల కింద పిటిషనర్‌ను డీఫాల్టర్ జాబితాలో పెట్టడం అక్రమమని తెలిపారు. పిటిషనర్ విద్యుత్తు కొనుగోళ్లలో పాల్గొనేలా అనుమతించాలని కోరారు. పవర్‌గ్రిడ్, కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి ఆరు నెలలైనా స్పందించకపోవడం వల్లే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇదే తరహా వివాదంలో 25శాతం చార్జీలు చెల్లిస్తే విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించాలని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్ కూడా రూ.261 కోట్లలో 25 శాతం చెల్లిస్తే పవర్ ట్రేడింగ్‌కు అనుమతిస్తామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం 'ఇది రాష్ట్రంలోని కోట్లాది మందికి విద్యుత్తు సరఫరాకు సంబంధించిన అంశం. సరఫరా నిలిచిపోతే ఇబ్బందులొస్తాయి. ఇతర వనరులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సొంతంగా విద్యుదుత్పత్తి చేసుకోగలుగుతోంది. రాష్ట్రానికి కారిడార్ అవసరం లేకపోయి ఉండొచ్చు'అని పేర్కొంది. చార్జీల వివాదం సెంట్రల్‌కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉండగా విద్యుత్తు కొనుగోళ్లు చేయకుండా పిటిషనర్‌ను అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. ప్రాప్తి పోర్టల్ ద్వారా జారీచేసిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. పిటిషనర్‌ను విద్యుత్తు క్రయవిక్రయాల్లో పాల్గొనేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆదేశాలు కొనసాగుతాయని పేర్కొంటూ విచారణను అక్టోబరు 17కు వాయిదా వేసింది. ఈ విషయాన్ని వెంటనే ప్రతివాదులకు తెలియజేయాలని ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, కేంద్ర విద్యుత్తు శాఖకు నోటీసులు జారీచేసింది.

బతకడానికి వచ్చినోళ్ల ఓట్లతోనే బీఆర్ఎస్‌కు సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో తెలుగు మీడియాతో రేవంత్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో చిల్లరగాళ్లు, బ్రోకర్లు చేరినందుకే కేసీఆర్ దగ్గరికి వెళ్లేందుకు తనకు మనసు రావడం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారని తెలిపారు. "ధర్నాలు చేయొద్దు. ఎక్కడి నుంచి వచ్చారు?" అని గతంలో కేసీఆర్ ఆంధ్రవారిని ఉద్దేశించి అన్న మాటలనే ఇప్పుడు కౌశిక్ రెడ్డి అంటున్నారని ధ్వజమెత్తారు. గాంధీకి పీఏసీ పదవి ఇవ్వడంలో తప్పేమీ లేదని.. గతంలో కూడా ఇతరులను పీఏసీలో నియమించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు తాము ఓనర్లమయినందున ఆ స్థానంలో తామే ఉండాలని హరీశ్ భావిస్తున్నారని ఆరోపించారు. 2018-23 మధ్య కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే.. అక్బరుద్దీన్ ఒవైసీని పీఏసీ ఛైర్మన్‌గా ఎలా నియమించారని రేవంత్ ప్రశ్నించారు. 2014లో టీడీపీలో 15 మంది ఎమ్మెల్యేలున్నా పీఏసీకి ఎర్రబెల్లిని రానిచ్చారని, తనను అనుమతించలేదని.. ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా తనను నియమించాలంటూ చంద్రబాబు లేఖ ఇచ్చినా నాటి సభాపతి పట్టించుకోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ నాలుగు వారాలలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును తాను అధ్యయనం చేయలేదని చెప్పారు. ప్రభుత్వాన్ని పడగొడతామని బెదిరింపులు చేసినందుకే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని.. అలా పడగొట్టే అవకాశం లేకపోతే తమకొచ్చే ప్రమాదం ఏమీ ఉండదని అన్నారు. ఏ పార్టీ వాళ్లు ఆ పార్టీలోనే ఉండాలని అంటే తనకొచ్చిన ఇబ్బందేమీ లేదని, కేసీఆర్ లక్కీ నెంబర్ అయిన 66మంది ఎమ్మెల్యేల బలం కాంగ్రెస్‌కు ఉందని చమత్కరించారు. పీఏసీలో అన్ని పార్టీలకూ తాము అవకాశం ఇచ్చామని, కాంగ్రెస్‌కు తరఫున నలుగురు ఉంటే బీఆర్ఎస్ నుంచి ఆరుగురిని, సీపీఐ, బీజేపీ, ఎంఐఎం నుంచి ఒక్కొక్కరిని చేర్చుకున్నామని చెప్పారు. కౌన్సిల్‌లో తమకు మెజారిటీ లేనందువల్ల బీఆర్ఎస్ నుంచి ముగ్గురిని తీసుకున్నామని, ఆ పార్టీకి తామేమీ లోటు చేయలేదన్నారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

చంద్రబాబును అభినందించిన ఉత్తమ్

వెలగపూడి సచివాలయంలో బాబుతో భేటీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబు నాయుడును తెలంగాణ జల వనరుల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభినందించారు. తన మిత్రుడి ఇంట జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం విజయవాడకు వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. బాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషంగా ఉందని ముఖ్యమంత్రితో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఇరువురి మధ్య స్నేహపూర్వక పరస్పర అభినందనలు మినహా.. రాష్ట్రాల అంశాలు ప్రస్తావనకు రాలేదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మంత్రివర్గ విస్తరణపై వచ్చే వారమే చర్చలు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు వచ్చే వారమే జరిగే అవకాశాలున్నాయి. రేవంత్ వచ్చే సోమవారం (16న) మరోసారి ఢిల్లీకి రానున్న సంగతి తెలిసిందే. అయితే.. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గురువారం ఆయన నివాసంలో భేటీ అయిన రేవంత్ రెడ్డి దీనిపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అంతకుముందు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సమయంలో మంత్రివర్గ విస్తరణపై సీఎంను ప్రశ్నించగా.. పీసీసీ అధ్యక్షుడే దానికి సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గాన్ని విస్తరించాలని పార్టీ అధ్యక్షుడిగా ఆయన నిర్ణయిస్తే.. ఎవరెవరిని తీసుకోవాలో తాను నిర్ణయిస్తానని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

'స్థానికత'పై సుప్రీం కోర్టుకు సర్కారు

» త్వరగా విచారించాలన్న విజ్ఞప్తికి ధర్మాసనం ఓకే

» హైకోర్టు తీర్పుతో రాష్ట్రంలో ఆగిన వైద్య విద్య ప్రవేశాలు

» సర్కారుకు అనుకూలంగా తీర్పు వస్తే వేగంగా అడ్మిషన్లు

» లేదంటే మళ్లీ మార్గదర్శకాలు ఇవ్వాల్సిందే



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. వైద్య విద్యలో అడ్మిషన్లు పొందడానికి తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్మీడియట్ విద్యను తెలంగాణలో పూర్తి చేసిన వారికే స్థానిక రిజర్వేషన్ వర్తింపజేస్తామంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 33పై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లు చదువుకోలేదన్న కారణంతో శాశ్వత నివాసులకు ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించకూడదని సదరు ఆదేశాల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తెలంగాణ తరఫు న్యాయవాదులు కోరగా.. ధర్మాసనం అంగీకరించింది. అయితే, వైద్య విద్య ప్రవేశాలపై సందిగ్ధం నెలకొన్న వేళ.. సుప్రీం కోర్టు ఏం తీర్పు వెలువరిస్తుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒక వేళ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇస్తే... వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక వేళ హైకోర్టు తీర్పును సమర్థిస్తే మాత్రం కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వైద్య శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అక్టోబరు 1 నుంచే వైద్య విద్య తరగతులు ప్రారంభం కావాలి. అక్టోబరు 30లోగా వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎలాంటి ప్రవేశాలు చేపట్టకూడదు. అందుకు మరో 47 రోజులే గడువు ఉండగా.. రాష్ట్రంలో ఇప్పటిదాకా ప్రవేశాల ప్రక్రియే ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో వైద్య విద్య ప్రవేశాలపై సమీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ పూర్తి కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందంటూ ఆరా తీశారు. ఒక వేళ సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రాకుంటే తక్షణమే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుందని, ఆ ప్రకారం రిసిడెన్స్ సర్టిఫికెట్ల జారీకి సమయం పడుతుందని అధికారులు మంత్రికి వివరించారు.

4 రౌండ్లు... ఒక్కో దానికి 10 రోజులు

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీ తర్వాత, విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లకు చివరిగా స్ట్రే వేకెన్సీ రౌండ్ ద్వారా భర్తీ చేస్తారు. ఒక్కో రౌండ్‌కు కనీసం పది రోజుల సమయం పడుతుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది, యాజమాన్య, ఎన్ఆర్ఐ కేటగిరీల కింద మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరసి మొత్తం 24,122 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ అంతా అక్టోబరు 30లోగానే పూర్తి చేయాలి. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకుంటే మిగిలిపోయిన సీట్లను అలా వదిలేయాల్సిందే. ఈ నేపథ్యంలో అటు వైద్యశాఖలోనూ, ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి గత నెల 3వ తేదీ నుంచే దేశ వ్యాప్తంగా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆలిండియా కోటా సీట్లకు ఆగస్టు రెండో వారంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువచ్చినా...సమయం సరిపోకపోవచ్చన్న అభిప్రాయాలున్నాయి.ఈ నేపథ్యంలో ఒక వేళ రాష్ట్రంలో సీటు రాని విద్యార్థులు.. పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీల్లో చేరే అవకాశం కోల్పోనున్నారు.

కేంద్ర సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి

లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.. పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి

» బీజేపీయేతర రాష్ట్రాల మంత్రుల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీల వల్ల రాష్ట్రాల పన్నుల వాటా నిధుల్లో కోత పడుతోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సెస్‌లు, సర్‌చార్జీలను నిరోధించాలని లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఐదు బీజేపీయేతర రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ ఆర్థిక మంత్రుల సమావేశం గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భట్టివిక్రమార్క.. పన్నుల వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే నిధులను 14వ ఆర్థిక సంఘం 32 నుంచి 42 శాతానికి పెంచిందని, 15వ ఆర్థిక సంఘం దాన్ని 41 శాతానికి కుదించిందని తెలిపారు. ఈ 41 శాతం నిధులు కూడా రాష్ట్రాలకు రావడం లేదని, కేవలం 31 శాతం నిధులు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను వసూలు చేస్తుండడంతో పన్నుల వాటా తగ్గుతుందని అన్నారు. వీటిని కూడా రాష్ట్రాలకు పంచాలని అడుగుతుంటే కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర జీడీపీకి 30 శాతం భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయని, దేశ జనాభాలో 19.6 శాతం జనాభా ఈ రాష్ట్రాల్లోనే ఉందని తెలిపారు. కానీ, ఈ రాష్ట్రాలకు పన్నుల్లో వాటా నిధులు 21.07 శాతం నుంచి 15.80 శాతానికి తగ్గిపోయాయని చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పరిహారాన్ని సకాలంలో ఇవ్వడం లేదని, పర్యవసానంగా రాష్ట్రాలు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవడంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)లో కఠినమైన నిబంధనలున్నాయని, వాటికి రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఇలా సీఎస్ఎస్‌ల కోసం రాష్ట్ర సొంత వనరులను మళ్లించాల్సి వస్తుండడంతో ఇతర ముఖ్యమైన రాష్ట్ర పథకాలకు నిధుల కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రాలకు నికరంగా వచ్చే పన్నుల వాటా నిధులను తగ్గిస్తూ.. మరోవైపు రాష్ట్రాలకు సరిగా ఉపయోగపడని సీఎస్ఎస్‌లకు కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచుతోందని ఆరోపించారు. ఇప్పటికే దేశ ద్రవ్యలోటు జీడీపీలో 5.6 శాతానికి పెరిగిందన్నారు. ద్రవ్య బాధ్యతను పాటిస్తున్న రాష్ట్రాలకు ఒక నీతి, ద్రవ్యలోటు పెరుగుతున్నా యథేచ్ఛగా రుణాలు తీసుకునే కేంద్రానికి మరో నీతా అని ప్రశ్నించారు.

ఇవీ రాష్ట్ర డిమాండ్లు..

- కేంద్ర ప్రభుత్వ సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి.
- కేంద్ర పన్నుల్లో వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి.
- ద్రవ్య బాధ్యత పాటించే రాష్ట్రాలు ఎక్కువ రుణాలు తీసుకునేలా స్వయంప్రతిపత్తిని కల్పించాలి.
- డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు పెరిగేలా చూడాలి.
- కేంద్రప్రాయోజిత పథకాలను రాష్ట్రాలు తమ అవసరాలకు తగ్గట్టు వినియోగించుకునే అవకాశమివ్వాలి.

రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 12: ప్రజలకు పంపిణీ చేసే రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. రేషన్ బియ్యాన్ని గురువారం మండలం నుంచి అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు విట్టంపేట గ్రామ శివారులో సీఐ తనిఖీలు చేపట్టారు. ట్రాలీలో 30 క్వింటాళ్ల బియ్యాన్ని మోర్తాడ్‌కి అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ సయ్యద్, క్లీనర్ ముజీబ్‌లను విచారించగా మండలంలోని జగ్గసాగర్, విట్టంపేట గ్రామాల్లోని ప్రజల వద్ద తక్కువ రేటుకు బియ్యం సేకరించి మోర్తాడ్‌కు తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. తరలిస్తున్న బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. డ్రైవర్, క్లీనర్‌తో పాటు ఓనర్ నసీర్‌లపై కేసు నమోదు చేశారు. ఓనర్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

అభివృద్ధికి నిరంతరం కృషి



ఎమ్మెల్యేను కలిసిన ఇందిరానగర్ గ్రామస్థులు

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 12: బీర్‌పూర్ మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేశానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నూతన గ్రామపంచాయతీగా ఏర్పడ్డ ఇందిరానగర్ కాలనీవాసులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నన్నారు. బీర్‌పూర్ మండలం నర్సింహుల పల్లె గ్రామపంచాయతీ అనుబంధగ్రామమైన ఇందిరానగర్ గ్రామ పంచాయతీ రాష్ట్రంలోనే ఎస్సీ జనాభా గల గ్రామ పంచాయతీగా నిలవడం హర్షనీయం అని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్‌రావు, నారపాక రమేష్, సుమీన్, సతీష్, నారా యణ, రవి, సుధాకర్, రాజన్న, సత్తన్న, నర్సయ్య పాల్గొన్నారు.

జగిత్యాల రూరల్: పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం రూరల్ మండలం వంజరిపల్లి ఎల్లయ్యపల్లిలో యాదవ సంఘం బోరు ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచు సరోజనమల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ కుడుకల లక్ష్మన్, నాయకులు హరీష్, కొమురయ్య, మల్లయ్య, గంగరాం, రాములు, ఎర్రయ్య తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న మండల స్థాయి క్రీడలు

రాయికల్, సెప్టెంబరు 12: రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడలు గురువారం రెండో రోజూ కొనసాగాయి. ఈ సందర్భంగా బాలురకు కబడ్డీ, వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో 18 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు స్థానిక విస్డమ్ స్కూల్, వివేకవర్ధిని పాఠశాలలో భోజన వసతి కల్పించారు. రాయికల్ మండల పీఆర్‌టీయూ శాఖ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నీటి వసతి కల్పించారు. ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొంటారని ఎంఈవో గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల క్రీడా కార్యదర్శి కృష్ణప్రసాద్, పీడీలు గంగాధర్, రాజగో పాల్, సుజాత, పీఈటీలు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం మండల స్థాయి క్రీడలు కొనసాగాయి. అండర్ 14 బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహించారు. ఈ క్రీడల పోటీలలో ఎంఈవో ఎ. శ్రీనివాస్, పీడీ రాజమల్లయ్య, సీనియర్ క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

బీర్‌పూర్‌లో ముగింపు..

బీర్‌పూర్,సెప్టెంబరు 12: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడలు గురువారంతో ముగిశాయి. అండర్ 14, 17 బాలురు, బాలికలకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యరాజ్, అక్షర పాఠశాల కరస్పాండెంట్ మారుతి, పీడీలు లక్ష్మన్, మంజుల ధరణి, నబుద్దీన్, మహేష్, మనోహర్, నరేష్ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 12: అవసరం ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాదాతలు కావాలని ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ అన్నారు. వినాయక నవరాత్రుల సందర్భంగా గురువారం మండలంలోని బండలింగాపూర్ గ్రామానికి చెందిన త్రీడి యువసేన ఆధ్వర్యంలో నో యువర్ బ్లడ్ గ్రూప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్సై అనిల్ ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు రఘు, రోహన్, అనిరుధ్, శ్రీకాంత్, కృష్ణ, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

గొల్లపల్లి, సెప్టెంబరు 12: గొల్లపల్లి మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. గ్రామంలో జ్వరాలబారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని ఏఎంసీవైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, తాజా మాజీ ఎంపీటీసీ లంబ ధనవ్వలక్ష్మణ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. విప్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారి నరేష్ రోగులకు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ నరేందర్, హెల్త్ అసిస్టెంట్ వేణుగోపాల్, ఏఎన్ఎం పుష్ప, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి:మండలంలోని బతికెపల్లిలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ నరేష్ ఆధర్యంలో డాక్టర్ రాకేష్ పాల్గొని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శోభారాణి, వెంకటరమణ, సంధ్య, కేతలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వరరావు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 12: ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ ను గురువారం మెట్‌పల్లి డిఎస్పీ ఉమామహేశ్వరరావు తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసు వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ పాల్గొన్నారు.

వినాయక మండపాల పరిశీలన

రాయికల్, సెప్టెంబరు 12: రాయికల్ పట్టణంతో పాటు అల్లీపూర్, అయోధ్య గ్రామాల్లో గురువారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ రెడ్డి పలు వినాయక మండపాలను పరిశీలించారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భక్తులకు పలు సూచనలు చేశారు. డీఎస్పీ వెంట సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై అశోక్‌లు ఉన్నారు.

మాకూ డబుల్ బెడ్ రూం ఇళ్లు కావాలి



నూకపల్లి శివారులో గల డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

- నూకపల్లి అర్బన్ కాలనీలో కేటాయించాలని డిమాండ్
- తమ భూముల్లో నిర్మించారని విన్నపాలు
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్న గ్రామస్థులు
- కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, సెప్టెంబరు 12: జగిత్యాల పట్టణ పేదలకు నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లల్లో తమకు వాటా ఇవ్వాలని మల్యాల మండలం నూకపల్లి గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. తమ గ్రామంలో ఇళ్లులేని పేద వారికి ఇళ్లు కేటాయించాలని కొన్నేళ్లుగా ప్రభుత్వాలను కోరుతున్నారు. జగిత్యాల పట్టణంలో ఇళ్లు లేని వారి కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ అర్బన్ హౌజింగ్ కాలనీని మల్యాల మండలం నూకపల్లి, జగిత్యాల మండలం నర్సింగపూర్ గ్రామాల శివారులో నిర్మించడానికి గాను 2007కు ముందు భూసేకరణ చేశారు. ఇందుకు గాను నూకపల్లి రైతుల నుంచి 165 ఎకరాలతో పాటు నూకపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నం.193లో 30 ఎకరాల ప్రభుత్వ భూమిని అర్బన్ కాలనీ కోసం సేకరించి ఇళ్లు నిర్మించారు. కొన్నాళ్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక సుమారు 4700 డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టి ఏడాది క్రితం అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. తమ పరిధిలో నిర్మాణాలు చేపట్టినందున తమకు ఇళ్లు కేటాయించాలని నూకపల్లి గ్రామస్థులు ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతూనే ఉన్నారు.

● 150 ఇళ్ల కోసం వినతి

తమ గ్రామంలో ఇళ్లు లేని వారు అనేక మంది ఉన్నారని కనీసం 150 ఇళ్లు కేటాయించాలని ఇటీవల నూకపల్లి గ్రామస్థులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు విన్నవించారు. విలువైన భూములను తమ గ్రామస్థులు అందించారని పేదలకు మంజూరు చేయాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే గ్రామస్తులతో పాటు కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి జగిత్యాల అర్బన్ కాలనీలో నూకపల్లి వాసులకు ఇళ్లు అందించాలని అన్నారు. ఇళ్లు లేని వారికి అవకాశం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌తో పేర్కొన్నారు. కాగ ఈ విషయమై గ్రామస్తులు ఇళ్లు ఇచ్చే వరకు తాము పోరాడుతామని అంటున్నారు. నూకపల్లి గ్రామస్థుల కోసం బీజేపీ నాయకులు కూడా ఇటీవల కలెక్టర్‌ను కలిసి ఇళ్లు కెటాయించాలని వినతిపత్రం అందజేశారు.

● ఏడాది క్రితం 500 ఇళ్లకు ఆదేశం

గత అక్టోబర్‌లో డబుల్‌బెడ్ రూం ఇళ్ల ప్రారంభానికి వచ్చిన అప్పటి మంత్రి కేటీ రామారావును ఇక్కడి ప్రజాప్రతినిధులు కలసి మల్యాల మండలం పరిధిలోని నూకపల్లి శివారులో జగిత్యాల వాసుల కోసం ఇళ్లు నిర్మించారని అయితే తమ మండలానికి ప్రాధన్యం కల్పించలేదని వెయ్యి ఇళ్లు అందించాలని కేటీఆర్‌ను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందించడంతో స్పందించిన కేటీఆర్ 500ఇళ్లు కేటాయించాలని అక్కడే ఉన్న అప్పటి కలెక్టర్ యాస్మిన్‌బాషాను ఆదేశించారు. అయితే అప్పుడున్న బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాకపోగా అది మూలన పడింది. తాజాగ గ్రామస్థులు మళ్లీ తమకు ఇళ్లు కేటాయించాలని కాంగ్రెస్ ప్రభుత్వంను కోరుతున్నారు

ఇళ్లు లేని కుటుంబాలు 200 ఉన్నాయి..



తమ గ్రామంలో ఇళ్లు లేని కుటుంబాలు దాదాపుగా 200లకు పైగా ఉన్నాయని కనీసం 150 ఇళ్లు ప్రస్తుతానికి కేటాయించాలి. తమ గ్రామ రెవెన్యూ పరిధిలోనే వేలాది డబుల్‌బెడ్ రూం ఇళ్ల సముదాయాలు నిర్మించినందున తమకు అవకాశం ఇవ్వాలి. ఈ మేరకు ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

- చెవులమద్ది శ్రీనివాస్, నూకపల్లి

మాకు ఇళ్లు కేటాయించాలి



నాకు ఇళ్లు లేదు. డబుల్‌బెడ్ రూం ఇళ్లలో ఇళ్లు ఇవ్వాలి. నాతో పాటు మా గ్రామంలో అనేక మందికి ఇళ్లు లేవు. తమ గ్రామం పేరు మీద గల కాలనీలో తమకు ఇళ్లు అందించాలి. ఇప్పటికే ఇళ్ల కోసం అధికారులకు అనేక దరఖాస్తులు అందించడం జరిగింది. ఇళ్లు లేని వారికి ఇళ్లు అందించి న్యాయం చేయాలి

- బట్టు కవిత, నూకపల్లి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



వెల్లుల్లలో విద్యార్థులతో కబడ్డీ ఆడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 12 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గురువారం మండలంలోని వెల్లుల్ల ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను ఆయన ప్రారంభించారు. మండలం పరిధిలోని 24 పాఠశాలలోని అండర్-14కి చెందని 400 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి సరదాగా కబడ్డీ ఆడి అక్కడున్న వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడతూ నేటితరం విద్యార్థులు, యువతరం టెక్నాలజీ వైపు దూసుకెళ్తున్న తరుణంలతో క్రీడలపై ఆసక్తిని పెంపొందించేలా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుతో పోటీ పడుతూనే ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందడంతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మెట్‌పల్లి ఎల్ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ మారు మురళీదర్‌రెడ్డి, ఎలేటి ముత్యంరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రవీందర్, పీఈటీలు కొమరయ్య, కార్తీక్, జ్ఞానేశ్వర్, ప్రశాంత్, వంశీ, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

కోరుట్ల, సెప్టెంబరు 12 : ఉపాధ్యా యులు జమ చేసుకున్న జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీఎస్ యుటీఎఫ్ జిల్లా ప్రధాక కార్యదర్శి అంబటి భూమేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణ పరిధిలోని యెఖీన్‌పూర్ పాఠశాలలో సభ్యత్వ నమోదును ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. జూన్‌లో బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుల సప్లిమెంటరీ బిల్లులు, స్పాట్ వాల్యూవేషన్ బిల్లులను విడుదల చేయాలని అన్నారు. బదిలీల్లో వేరే పాఠ శాలకు బదిలీ అయిన 124 మంది ఉపాధ్యాయులను బదిలీ అయిన స్థానాలకు రిలీవ్ చేయాలన్నారు.

చికిత్స పొందుతూ మృతి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 12 :జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన చింతలపల్లి సాయమ్మ (63) అనే వృద్ధురాలు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. కేసు దర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండె పోటుతో మృతి

ఎండపల్లి, సెప్టెంబర్12: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన గోనె సురేందర్ రెడ్డి గుండెపోటుతో సింగాపూర్‌లో మృతి చెందాడు. సురెందర్‌రెడ్డి సింగాపూర్ లోనే ఉంటున్నాడు. బుధవారం గుండెపోటుతో మృతి చెందడంతో మృతదేహాన్ని తీసుకువస్తున్నట్టు బంధువులు తెలిపారు.

టీపీయూఎస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

ధర్మపురి, ఆగస్టు 12: ధర్మపురి మండలంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయుఎస్) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా టీపీయుఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అయిల్నేని నరేందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒడ్నాల రాజశేఖర్ మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, అదే విధంగా పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే పూర్తి స్థాయిలో విడుదల చేయాలని కోరారు. 317 జీవో బాధితులు అందరి సమస్యను పరిష్కరించాలని అన్నారు. చైల్డ్ కేర్ లీవ్‌ను మహిళా ఉపాధ్యా యులకు నిబంధనలు సరళతరం చేసి వారి సర్వీస్ కాలంలో ఎప్పుడైన ఉపయో గించుకునేలా వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీయుఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రొట్టె శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బండి మహేష్, జిల్లా కార్య దర్శి కాశెట్టి రమేష్, మండల అధ్యక్షులు కాశెట్టి శ్రీని వాస్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, రాజేశ్వర్, కాశెట్టి వెంటకరమణ, కన్నం నాయుడు, కిరణ్, గుండ రమేష్, చల్ల కృష్ణ, కనపర్తి సంతోష్ పాల్గొన్నారు.


కార్యకర్తలు పార్టీకి పునాదులు

కొడిమ్యాల, సెప్టెంబరు 12 : కార్యకర్తలు బీజేపీకి పునాదులు అని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ విజయవం తానికి కార్యకర్తలు పట్టుదలతో కృషి చేయాలన్నారు. ప్రతి బూతులో 250మందికి తక్కువ కాకుండ సభ్యత్వ నమోదు చేయాలని కోరారు. సభ్యత్వ నమోదుకు 8800002024 నెంబరుకు మిస్డ్ కాల్ చేసి మెసేజ్ ద్వారా సభ్యత్వం నెంబరు పొందాలన్నారు. ప్రధాని మోదీ చేపట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పథకాలకు ప్రజలు తెలంగాణలో ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారన్నారు. బీజేపీ నాయకులు చల్ల శ్రీనివాసరెడ్డి, రాజేశం, పద్మ, తిరుపతిరెడ్డి, అరుణ్, వెంకట్‌రావు, భూమేష్, చిరంజీవి, నాగరాజు, హరీ ష్, రాంచందర్‌రావు, రమణాచారి ఉన్నారు.


నియోజకవర్గ స్థాయి బీజేపీ సభ్యత్వ నమోదు

గొల్లపల్లి: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో గురువారం బీజేపీ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ 88000002024 మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్ సభ్యత్వం తీసుకోవాలని, ప్రతి బూత్ నుంచి 200 మందిని సభ్యత్వం చేయాలన్నారు. ప్రతి ఒక కార్యకర్త 70 వేల సభ్యత్వాలు చేయాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపెల్లి సత్యనారాయణరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నం అంజన్న, నియోజకవర్గ కన్వీనర్ కొమ్ము రాంబాబు, గొల్లపల్లి మండల అధ్యక్షుడు మహేష్, సెన్సార్ బోర్డు మెంబర్ పిల్లి శ్రీనివాస్, మహిళా నాయకురాలు అనసూర్య, జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం ఉన్నారు.

వినాయకుడికి భక్తిశ్రద్ధలతో పూజలు



రాయికల్‌లో ప్రత్యేక అలంకరణలో గణనాథుడు



ధర్మపురిలో కొలువై ఉన్న వినాయకులు



జగిత్యాలలో పూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ధర్మపురి, సెప్టెంబరు 12: ధర్మపురి క్షేత్రంలోని పలు వీధుల్లో నెలకొల్పిన వినాయక మండపాల్లో గురువారం గణనాథుడు పూజలు అందుకున్నాడు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య గణనాథుడికి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య నిత్యాన్న సత్రంలో వినాయక మండపంలో గణనాథుడికి రకరకాల పుష్పాలతో అలకంరణ చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఆర్యవైశ్య, వర్తక సంఘాల మండల, పట్టణ శాఖల అధ్యక్షులు కూర గాయల సంతోష్‌కుమార్, మురికి శ్రీనివాస్, అక్కెనపెల్లి రాజేందర్, కోశాధికారులు రంగ శంకరయ్య, జక్కు రవీందర్, ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అ ధ్యక్షురాలు జక్కు పద్మ, పట్టణ అధ్యక్షురాలు గందె పద్మ పాల్గొన్నారు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం) : పట్టణంలోని పలు వినాయక మండపల వద్ద వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మండపలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని గంగపుత్ర బెస్త సంఘం ఆధ్వర్యంలో, పట్టణంలోని కోర్టు అవరణలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో, అమృత టవర్స్ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లోని వినాయక మండపల వద్ద గురువారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, వేణుగోపాల్, శ్రీనివాస్, నాయకులు గంగాధర్, పర్రె శంకర్, రమేష్, మహాజన్ నర్సింలు పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్: వినాయక నవరాత్రులను పురస్కరించుకొని పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి సందర్శించారు. మండపాల వద్ద మొక్కులు చెల్లించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా మండపాల నిర్వాహకులు అతిథులను శాలువాలతో సత్కరించారు. మున్సిపల్ మాజీ చైర్మెన్ శీలం వేణుగోపాల్, కౌన్సిలర్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు ప్రియాంక, ప్రవీణ్ తదితరులున్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని మహేంద్ర మ్యాదరి యువజన యూత్ ఆధ్వర్యంలో మట్టి గణపతిని ప్రతిష్ఠించారు. కులవృత్తి ఉట్టిపడేలా గంపలతో అలంకరించిన విద్యుద్దీపాల అలంకరణ ఆహూతులను అలరించింది. ఈ సందర్భంగా గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లతికఅనిల్, యూత్ నాయకులు ఊరేడి రాజు, ఇందూరి రంజిత్, రాజు, వికాస్, రాజేష్, రఘు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : గణపతి నవరాత్రుల సందర్భంగా మల్లాపూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో గురువారం వినాయకుడికి విశేషపూజలు జరిపారు. కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు కల్వకుంట్ల సుజిత్‌రావు మొగిలిపేట గ్రామంలోని గణేష్ మండపాలంలోని వినయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. వినాయక నిమజ్జ నంను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మంటపాల వద్ద భక్తులు అర్చనలు జరిపి ప్రసాద వితరణలు జరిపారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో వాడల్లో ఆద్యాతిమీక వాతావరణం నెలకొంది.

మాతాశిశు కేంద్రం ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 12 : జిల్లా కేంద్రం లోని మాతాశిశు కేంద్రం ఆసుపత్రిని కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలువార్డులను సందర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో వైద్య సేవల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఓపీ సేవలను నిరంతరంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. డాక్టర్లు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. డాక్టర్లు సమయపాలన పాటించక పోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వెల్గటూర్: విష జ్వరాలతో జనం విలవిల లాడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రతిపక్షంలో ఉన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించడం తప్పా? అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్ ప్రశ్నించారు. గురువారం విలేఖరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి మాట్లాడితే అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలో, మండలంలోని పూడూర్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ స్టేషన్‌లను గురువారం డీపీవో రఘువరణ్ పరిశీలించారు.డీపీవో వెంట ఎంపీవో వాసవి, కొడిమ్యాల, పూడూర్ కార్య దర్శులు వంశీవర్ధన్, వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ శివప్రసాద్, సిబ్బంది రాజశేఖర్, శంకరాచారి, అశోక్, ప్రధానోపాధ్యాయుడు ఉన్నారు.

●మండల కేంద్రంలోని రమేష్‌కు చెందిన మెడికల్ షాప్‌లో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగినట్లు బాధితుడు రమేష్ తెలిపాడు. ప్రమాద సమాచారాన్ని గ్రామస్తులు ఫైర్ స్టేషన్‌కు, పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో ఫైర్ స్టేషన్ సిబ్బంది వచ్చి మెడికల్ షాప్‌పై గదిలో ఉంటున్న మల్లేశంను కాపాడినట్లు ఫైర్ స్టేషన్ అధికారులు తెలిపారు.

కథలాపూర్: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో గణేశ్ నిమజ్జన వేడుకలు జరుపుకోవాలని ఎస్సై నవీన్ సూచించారు. గురువారం మండలంలోని గంభీర్ పూర్, అంబారిపేట గ్రామాల్లోని గణపతి మండపాలను పరిశీలించి యువకులకు దిశా నిర్దేశం చేశారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని కేసీఆర్‌తండాలో పాడి ఆవు పాము కాటుతో గురువారం మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ. 30 వేలు ఉంటుందని ఆవేదనతో రైతు తెలిపారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని చిన్నమెట్‌పల్లి, సంగెం, నాగులపేట, మోహన్‌రావుపేట, పైడిమడుగు, అయిలాపూర్ గ్రామాల్లో గురువారం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. లబ్దిదారుల ఇళ్ళకు వెళ్ళి రు. 9 లక్షల విలువైన చెక్కులను అందించారు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం) : మెట్‌పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల పట్టణంలో రేకుర్తి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించగా అందులో 40 మందిని కంటి అపరేషన్‌ల నిమిత్తం కరీంనగర్ రేకుర్తి అసుపత్రికి తరలించారు. తరలించిన 40 మందికి వైద్యులు ఉచితంగా కంటి అపరేషన్‌లు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఇల్లెందుల శ్రీనివాస్, నాయకులు చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, వెల్మల శ్రీనివాస్‌రావు, రాకేష్, వేణుగో పాల్ పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : మూడు రోజులుగా కొనసా గుతున్న మండల స్థాయి క్రీడలు గురువారం ముగిశాయి. అండర్ 14 బాలుర విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో సుశాంత్, ద్వితీయ స్థానంలో అబ్దుల్ ఎమిద్, 100 మీటర్లలో అర్షద్, అభినాష్, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో అఫ్రినా ఖానం, ద్వితీయ స్థానంలో గంగ విజేతలుగా నిలిచారని పీఈటీలు తెలిపారు.

ఇబ్రహీంపట్నం : మండలంలోని వర్షకొండ గ్రామంలో గురువారం ప్రత్యేకధికారి, తహసీల్దార్ జి.ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్య లయంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు అధికా రుల దృష్టికి తీసుకువచ్చారు. మాజీ ఎంపీటీసీ పోనకంటి చిన్న వెంకట్, బీజేపీ మండల అధ్యక్షులు బాయి లింగారెడ్డి, గ్రామ స్తులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : మండల కేంద్రంలో శివారులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను పట్టుకున్న ట్లు ఎస్సై కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మల్లాపూర్ శివారులోని దుర్గమ్మ టెంపుల్ పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో అక్రంగా నిల్వ చేసిన ఆకుల శ్రీకాంత్, పస్తం రాజేష్‌లు సుమారు 10 క్వింటాల రేషన్ బియ్యం సంచులను గుర్తించినట్లు పేర్కొన్నారు. వారిని విచారించగా ఖానాపూర్‌కు చెందని ప్రభాకర్ అను వ్యక్తి కొనుగోలు చేస్తాడని తెలపగా వారిని అదుపులోకి తీసుకొని రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించడం జరుగుతందన్నారు.